క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు సీహెచ్ చక్రవర్తి 165 మందికి పరీక్షలు చేసి 14 మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. వీరికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉస్మా కౌముది, మెడికల్ ఆఫీసర్ తస్లీమా నస్రీన్, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్ఎం అనంత లక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశలు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీసీజీటీఏ జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ అధ్యాపకుల బదిలీలు తక్షణమే చేపట్టాలని, రీడిజిగ్నేషన్ వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన జీఓ 42ను రద్దు చేయాలని, అధ్యాపకుల పెండింగ్ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధ్యాపకులు పాల్గొన్నారు.

16న బాల గోకులం పోటీలు



బాల గోకులం పోటీల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఈనెల 16న కృష్ణాష్టమి పర్వదినాన్ని పరిష్కరించుకొని బాలగోకులం పేరిట శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కొవ్వూరు రోడ్డులో ఉన్న ఏఆర్ ఏసీ మినీ కల్యాణ్ మండపంలో పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనేవారు ఫోన్ నంబర్లు 90599 32963, 83099 93236, 94406 10659 సంప్రదించాలని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు బాలబాలికలకు మొదటి విభాగం, ఆరు నుంచి పదేళ్లలోపు బాల బాలికలకు రెండో విభాగంగా ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000, రూ.4000, రూ.3000 విలువ చేసే వెండి ప్రతిమలు బహుమతులుగా అందిస్తామని పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు

చింతలపూడి : ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు ఆరోపించారు. మంగళవారం చింతలపూడి మండలం ఊట సముద్రం గ్రామ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు ఎస్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి విజయరాజు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో అక్క, చెల్లెమ్మలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బాబు అంటేనే మోసం, జగన్ అంటే నమ్మకం అని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్ జగన్ హయాంలో ప్రజా సంక్షేమానికి ప్రధాన్యత ఇవ్వగా, నేడు కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికి వదిలేసి , ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తూందని తెలిపారు. ఈ సందర్భంగా క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, సర్పంచ్ రాంబాబు, మండల బూత్ కమిటీల కన్వీనర్ ఎస్ భరత్‌రెడ్డి, నాగిరెడ్డి, సుదీర్‌బాబు, ప్రగడవరం సర్పంచ్ టి.భూపతి, దేశవరం ఎంపీటీసీ నాగలక్ష్మి, రమేష్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలపూడి : క్యూ ఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు



లింగపాలెం : కె.గోకవరంలో పోస్టర్ విడుదల చేసిన నాయకులు

బాబు మోసం అందరికీ తెలియాలి

లింగపాలెం: సూపర్ సిక్స్ తదితర హామీలతో ప్రజానీకాన్ని చంద్రబాబు చేసిన మోసం ప్రతి గడపకు చేరాలని వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు అన్నారు. మంగళవారం కె.గోకవరం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు అమలు కాని హామీలిచ్చి ప్రజలను మాయ చేస్తున్నారని వివరించారు.

వైఎస్సార్ సీపీ కె.గోకవరం కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా పార్టీ కె.గోకవరం గ్రామ కమిటీని సీనియర్ నేత మందడపు పెద్ద చంటి సమక్షంలో పరిశీలకుడు ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి గంటి రాజేష్ బాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా మారిశెట్టి రామకృష్ణ, తంగెళ్ల ముడి ఆనందరావు, చాగంటి ప్రకాశరావు, కొంగ ధర్మారావు, కార్యదర్శులుగా అరవపళ్ల భద్రరావు, మొగుళ్ల నాగరాజు, కన్నాటి నాగరాజు, మంజుల రామారావులు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

చెరువులో చేప పిల్లలు విడుదల



చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: నీరు నిల్వ ఉన్న ప్రదేశాలు, చెరువుల్లో గంబోషియా చేపలు విడుదల చేయడం ద్వారా దోమలను నియంత్రించడంతోపాటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని డాక్టర్ మోహిత్ తెలిపారు. మండలంలోని నందాపురం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న రాచూరు సమీపంలోని చెరువులో మంగళవారం గంబోషియా చేపలను విడుదల చేశారు. ఈ చేపలు నీటి వనరుల అంచుల్లోనూ, దట్టమైన వృక్ష సంపద ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ సంచరిస్తాయని డాక్టర్ మోహిత్ తెలిపారు. ఆ సమయంలో దోమల లార్వాలు ఇవి ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ వై.నరేష్, పి.పెద్దిరాజు, ఎంపీహెచ్‌ఎస్ ఎం ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్ బాలాజీ, వెంకటేశ్వరరావు, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో విద్యార్థుల్లో రక్తహీనత

కొయ్యలగూడెం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వేదాంతపురం, బయ్యన్నగూడెం ఉన్నత పాఠశాలలో సరిపల్లి ఎంపీపీ స్కూల్లో నిర్వహించిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేష్‌కుమార్ సందర్శించారు. నులిపురుగులు వల్ల విద్యార్థుల్లో రక్తహీనత, తరచూ కడుపునొప్పి, నీరసంగా ఉండి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని, వీటి నిర్మూలనకు అందరికీ మాత్రలు మింగిస్తున్నామని తెలిపారు. వైద్యధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఏడాదికి రెండుసార్లు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. డాక్టర్ ఎం గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు బీవీ నారాయణ, ఏఎన్ఎం ఎం మాణికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ఎన్ వినోద్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు. మొత్తం 31 పాఠశాలల్లో 4,320 మందికి, 31 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1345 మందికి మాత్రలు మింగించారు. దీంతో 98.5 శాతం కార్యక్రమం పూర్తయింది. మిగిలిన వారికి ఈనెల 20న పంపిణీ చేయనున్నారు.



లింగపాలెం : విద్యార్థులకు టాబ్లెట్లు వేస్తున్న వైద్యాధికారి

ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

లింగపాలెం: నులిపురుగుల వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల క్షీణిస్తుందని లింగపాలెం పీహెచ్‌సీ వైద్యులు కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని సింగగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కె.అర్జునరావు, పీహెచ్ఎన్ కె.పద్మజ, సీహెచ్‌ఓ ఎన్ లావణ్య, ఎంపీపీఎస్ హెచ్‌ఎం పువ్వుల ఆంజనేయులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం : విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: మండలంలోని నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో నిమ్మలగూడెం, టిక్కినవారిగూడెం గ్రామాలకు, మైసన్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శ్రీనివాసపురం గ్రామానికి 3 ఫేజ్ 24 గంటల లైన్ వేసే పనుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. నిమ్మలగూడెం, టిక్కనవారిగూడెం, శ్రీనివాసపురం గ్రామాలలోని గృహ, వ్యవసాయ, కమర్షియల్ అన్ని రకాల సర్వీసులకు విద్యుతు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో అందని వైద్యం



అమరవరం పీహెచ్‌సీ

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలోని పీహెచ్‌సీల పరిధిలో 24 గంటల వైద్యం అందడంలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ కుక్కునూరు మండల ప్రచార కార్యదర్శి పొడియం వేణుగోపాల్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తన కుమారుడి ఆరోగ్య పరిస్థితి సరిగాలేక అమరవరం పీహెచ్‌సీకి సోమవారం అర్ధరాత్రి తీసుకెళ్తే వైద్యుడు లేడన్నారు. ఉన్న సిబ్బందికి సరిగా వైద్యం చేయడం రాలేదని తెలిపారు. పీహెచ్‌సీల్లో ప్రభుత్వం 24 గంటలు వైద్యం అందించే ఉద్దేశంతో కేటాయించిన ఇద్దరు డాక్టర్లూ అందుబాటులో ఉండడంలేదని వాపోయారు. ఏజెన్సీలో రాత్రి వేళ సరైన వాహన సదుపాయం ఉండదని, ఎమర్జెన్సీ కేసులు వస్తే వైద్యులు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. అధికారులు ఏజెన్సీ ప్రాంత ఆసుపత్రులపై పర్యవేక్షించాలని, పీహెచ్‌సీల్లో 24 గంటలూ డాక్టరు అందుబాటులో ఉండి వైద్యం అందించేలా చూడాలని కోరారు.

18న జీకే చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: జీకే చారిటబుల్ ట్రస్టును ఈ నెల 18న ప్రారంభించనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు గణిత ఆనంద్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక శ్రీ మల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

వైభవంగా సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం: స్వయంభూ శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. పూర్వాభాద్రా నక్షత్రం సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను వేదికపై ఆశీనులను చేసి, వైఖానస ఆగమ శాస్త్రబద్ధంగా కల్యాణ క్రతువును అర్చకులు నిర్వహించారు. తెల్లవారు ఝామున ప్రత్యేక పూజల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం వరకు వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,68,793 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

గురవాయిగూడెంశ్రీ హరిహరసత అయ్యప్ప స్వామి ఉపాలయమైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారని అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.



హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నసమారాధన

సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం ఉప్పల మెట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో అర్చకులు విశేష పూజలు చేశారు. ప్రతి సంకష్టహర చతుర్థి రోజున ఈ విధమైన పూజధికాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో సుమారు 400 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలోని రామచంద్రపురం శ్రీ కోదండరామ స్వామి ఉపాలయమైన విగ్నేశ్వరుని ఆలయంలో సంకష్ట చతుర్థి పూజలు నిర్వహించారు.



అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం వద్ద..

జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు కమిటీ అధ్యక్షులు గండికోట బాబి తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన దుట్టా రవిచందర్, వైద్యులు దుట్టా శ్రావణ్ చందర్, ప్రణవ్ కార్తికేయ ఆర్థిక సాయంతో అన్నప్రసాద వితరణ చేశామని పేర్కొన్నారు. దాతలను దుశ్శాలువాతో సత్కరించారు.

క్రికెట్ విజేత విజమూరి టీమ్

జంగారెడ్డిగూడెం: ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ శాఖ, న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సివిల్ కోర్టు జడ్జి కిషోర్ కుమార్ ప్రారంభించారు. విజేతగా విజమూరి కిరణ్ కిషోర్ టీమ్, రన్నర్స్‌గా పాశం ప్రతాప్ టీమ్‌లు నిలిచాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. తొలుత వింజమూరి కిరణ్‌కిషోర్ టీమ్, జీఎస్సార్ మూర్తి టీమ్‌లు తలపడినట్టు పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున మెమెంటోలు అందజేస్తామని బార్ అసోసియేషన్ తెలిపింది. జడ్జి కిషోర్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ధృడత్వానికి దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మేకా ఈశ్వరయ్య, కొల్లూరు సతీష్, గర్సికూటి చిరంజీవి రాంబాబు, మోదేపల్లి నాగులు, మానికల సూరిబాబు, సీహెచ్ డీవీ కోటేశ్వరావు, అచ్యుత శ్రీనివాసరావు, పిల్లి పెద్దిరాజు, బాషా శ్యాంబాబు, బొడ్డు శ్రీనివాస్, తల్లాడ అశోక్ కుమార్, కొండాబత్తుల నరసింహారావు, రాయి వసంతరావు, నాగిరెడ్డి, బండారు లతాకుమారి, జూనియర్ న్యాయవాదులు తదితలు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభించిన జడ్జి కిషోర్ కుమార్, చిత్రంలో క్రీడాకారులు

ఏలూరు వెళ్లిన దళిత నాయకులు

కామవరపుకోట: ఏలూరులోని సుఖీభవ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశానికి ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయ రాజు సూచన మేరకు మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని దళిత నాయకులు భారీగా తరలి వెళ్లారు. వీరిలో కామవరపుకోట ప్రెసిడెంట్ నానాది సాగర్, మండల సీనియర్ దళిత నాయకులు కనెకెళ్లి యేసుపాదం, గుర్రాల రవికుమార్, వాసే ఆనంద్, మద్ది రామయ్య, అందుగుల జాన్, బిరుదుగడ్డ మోహన్, మానుకొండ సునీల్, సిరిశెట్టి సిద్దిరాజు, నాగార్జున, మేడంకి రమేష్, గుమ్మల్ల శ్రీను, మానుకొండ దేవరాజు, కరిపోతు దావీదు, ఆడమిల్లి అచ్చయ్య తదితరులు ఉన్నారు.



ఏలూరుకు తరలివెళ్తున్న దళిత నాయకులు

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

కొయ్యలగూడెం: జాతీయ గ్రంథాలయ దినోత్సవం స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్గీకరణ శాస్త్ర పితామహుడు షియాలి రామామృత రంగనాథన్ 133వ జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు రాముడు తెలిపారు. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.



రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

జంగారెడ్డిగూడెం: ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా పోలీసులు తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. 2023 సెప్టెంబర్ 12న జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు పాఠశాలకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఆదేశాలు, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఉత్తర్వులు మేరకు తడికలపూడి ఎస్సై చెన్నారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. చిన్నారులను హైదరాబాద్ రాజేంద్రనగర పరిధిలోని డాన్‌బాస్కోనగర్, కిస్మత్‌పూర్ ప్రాంతంలో ఉన్న రాక్‌హైస్కూల్ వద్ద గుర్తించారు. వీరిని ఏలూరు తీసుకువచ్చి మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆపరేషన్ ట్రేస్‌లో పాల్గొన్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బుట్టాయగూడెం: వర్షాకాలం నేపథ్యంలో గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ ఎం రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. పీ–4 సర్వే, తడి, పొడి చెత్త సేకరణ ఆధార్ లింకేజ్‌లు, ఇంటి పన్నుల నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు కె.జ్యోతి, ఎం శ్రీహరి, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎల్‌పీఓ రాజు

జేపీ యూత్ ఆధ్వర్యంలో పోటీలు

జంగారెడ్డిగూడెం: జయప్రకాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు యూత్ నాయకులు తెలిపారు. స్థానిక జేపీ సెంటర్ వద్ద ఈనెల 14న ఉదయం 9 గంటల నుంచి సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో చదరంగం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్స్ ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.2500, రూ.1500, జూనియర్స్ ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.1500, రూ.1000 అందజేస్తామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15న ఉదయం 8 గంటలకు పతాకావిష్కరణ, సాయంత్రం 4 గంటల నుంచి పాటల పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.2500, రూ.1500, జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు రూ.1500, రూ.1000 అందిస్తామని ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, ఏలూరు జిల్లా అధికారి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం నుంచి జిల్లా కోర్టు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా తిరిగి గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వరకు నిర్వహించారు. భారత మాతాకి జై, జై భారత్, జై జై భారత్ ప్రతి ఇంటిపై భారత జాతీయ జెండా ఎగురవేయాలి అని నినదించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం వద్ద ముగ్గులు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ, సిబ్బంది కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్లు, సహాయక ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక రోగులకు మందుల పంపిణీ

బుట్టాయగూడెం: మానసిక వ్యాధులను గుర్తించి వారికి ఉచితంగా మందులతోపాటు కౌన్సెలింగ్ కూడా ఇవ్వనున్నట్టు స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ బి.వసుంధర తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌పీ సైకియాట్రిస్ట్ హన్నా కోమలి మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. డాక్టర్ కోమలి మాట్లాడుతూ ప్రతి 2, 3 నెలలకు ఒకసారి బుట్టాయగూడెంలో జిల్లా స్థాయిలో మానసిక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మానసిక రోగులకు వైద్యం చేస్తున్న దృశ్యం

మాదేపల్లిలో నేడు గ్రామసభ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ నాగమణి తెలిపారు. రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం 13 నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు, అధికారులు పాల్గొంటారని, రైతులంతా హాజరుకావాలని ఆమె కోరారు.